

ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలి

గణేశ్‌నగర్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభు త్వ, ప్రైవేట్ ఐటీఐలలో చదివి 2024 సంవత్సరం ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో పేరు నమోదు చేసుకొని ఎంప్లాయ్‌మెంట్ కార్డు పొందాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి వై.తిరుపతిరావు తెలిపారు. ఆధార్ కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్ 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు, కులం సర్టిఫికెట్, ఎస్ఎస్‌సి, ఐ.టి.ఐ పాస్ సర్టిఫికెట్, ఒరిజినల్, జిరాక్స్ సెట్ తీసుకుని రావాలన్నారు. వెబ్‌సైట్‌లో www.employment.telangana.gov.in మీపేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:28 (ఆదివారం సాయంత్రం) | సహర్ 5:03 (సోమవారం ఉదయం)

ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టాలి



దీక్ష చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశార. కలెక్టరేట్ ఎదుట ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు ఆరవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తే ఎస్సీ ఉద్యోగాలన్నీ మాలలకే చెందుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వల్ల గత 70 సంవత్సరాలుగా ఎస్సీలలో అధిక జనాభా ఉన్న మాదిగలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ అన్యాయాన్ని గుర్తించే సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణను బలపరుస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తరువాత కూడా రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేయాలని ప్రయత్నించడం దారుణ మన్నారు. మార్చి 17న ఎస్సీ వర్గీకరణ చట్టం అ సెంబ్లీలో పెడతామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అప్పటి వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలు నిలిపివేస్తే వచ్చే నష్టమేమిటని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అసెంబ్లీలో ఆమోదించడంతో పాటు త్వరగా అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దండు అంజయ్య, సీపెల్లి నరేష్, మోదగుంపల్లి ప్రభుదాస్, నాగేళ్ల బాబూరావు, నక్క లక్ష్మన్, దండు వరలక్ష్మి, అలవాల సంపత్, వేల్పుల చిలుకమ్మ, గాలి బుచ్చమ్మ, వెంకటమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో విద్యుత్ సేవలు

- టీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు

గణేశ్‌నగర్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించడానికి సాంకేతికతను వినియోగిస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ మేక రమేష్ తెలిపారు. అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో అన్ని 33కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నెంబర్ పెయింటింగ్ చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 33కేవీ పోల్ నంబరింగ్ 56 పూర్తి అయ్యాయని, 11కేవీ పోల్ నంబరింగ్ 178 పూర్తి చేశామని తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ పోల్ నెంబర్ ద్వారా అక్కడి లోకేషన్ మ్యాపింగ్ తెలుసుకొని వెంటనే అక్కడికి వెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించవచ్చని అన్నారు. దీని ద్వారా అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. యూనిక్ పోల్ నంబరింగ్‌తో 33కెవి, 11కెవి విద్యుత్ లైన్ల క్రమబద్ధ నిర్వహణ చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గించడంలో యూనిక్ పోల్ నంబరింగ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వినియోగదారులకు మరింత నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 319 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం మ్యాథమెటిక్స్ పేపర్-2బి, బోటనీ, జువాలజీ పేపర్-2 పరీక్షలకు 319మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శనివారం నిర్వహించిన పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విభాగంలో కలిపి 12,925 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా జనరల్ విభాగంలో 231మంది, ఒకేషనల్‌లో 88 మంది మొత్తం 319 మంది పరీక్షకు హాజరు కాలేదు. జనరల్ విభాగంలో 12,694 మంది, ఒకేషనల్‌లో 1,317 మంది మొత్తం 14,011 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 23 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారని, ఎక్కడ కూడా కాపీయింగ్‌జరుగలేదని జిల్లా పరీక్షల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

ఏప్రిల్ 20 నుంచి ఓపెన్ 'పది', ఇంటర్ పరీక్షలు

కరీంనగర్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్థన్‌రావు, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ చలువాజి నాగేశ్వర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ, ఇంటర్‌లో అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులతో పాటు పరీక్ష ఫీజు చెల్లించిన సప్లమెంటరీ అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు సంబంధిత కేంద్రాల కో ఆర్డినే టర్లను సంప్రదించి హాల్‌టికెట్లు తీసుకొని పరీక్షలు రాయాలని సూచించారు. ఏప్రిల్ 26 నుంచి మే 3 వరకు ఇంటర్మీడియట్ అభ్యర్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

'స్మార్ట్' పనులపై నీలినీడలు

- అర్ధంతరంగా నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు
- ఆగిపోయిన ఆడిటోరియం
- టెండర్లకు నోచుకోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్
- విడుదల కాని మ్యాచింగ్ గ్రాంటు నిధులు
- ఈ నెల 31తో ముగియనున్న గడువు





నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనం

కరీంనగర్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. మార్చి 31తో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులన్నిటినీ పూర్తి చేసేందుకు తుదిగడువు విధించడంతో ఆలోగా పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. కేంద్ర ప్రభుత్వం 2017లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు ఎంపిక చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఐదేళ్లలో వేయి కోట్లతో స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.1,845 కోట్లతో డీపీఆర్‌ను రూపొందించి పంపించగా రూ. 934 కోట్లతో 47 రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఐదేళ్లలో ఈ పనులన్నీ పూర్తి కావలసి ఉండగా కోవిడ్-19, సాధారణ ఎన్నికలు ఇతరత్రా కారణా లతో పనులు పూర్తికాక గడువు పొడిస్తూ వచ్చా రు. దీనితో ఇప్పటి వరకు దాదాపు 800 కోట్ల రూపాయల విలువ చేసే స్మార్ట్ రోడ్లతో కలిపి మొత్తం 33 రకాల అభివృద్ధి పనులు పూర్తయ్యా యి. మరో 14 పనులు పూర్తి చేయాల్సి ఉంది. వీటిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబం ధించిన టెండర్ ప్రక్రియ పూర్తికాలేదు. మిగిలిన 13 పనులు కూడా అసంపూర్తిగానే వదిలి వేయడంతో ఆ పనులు పూర్తి చేస్తారో లేదో తెలియని పరిస్థితి. పనులు ప్రారంభించి వాటిని పూర్తి చేసేందుకు అంచనాలు పెరిగి వ్యయం కూడా పెరిగే అవకాశాలుంటాయి.

● తుది దశలో కమాండ్ కంట్రోల్ సెంటర్

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణ పనులు దాదాపు 90శాతం పూర్తయి తుది దశకు చేరుకోగా ఇంటర్నల్ పనులు పూర్తిచేయాల్సి ఉంది. గత జనవరి 28న పాలకవర్గ పదవీకాలం ముగిసేలోపు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించినప్పటికీ పనులు పూర్తికాక పోవడంతో ప్రారంభించకుండా వదిలిపెట్టారు. రెండు వెజ్, నాన్ వెజ్ సమీకృత మార్కెట్ల నిర్మాణాలను చేపట్టగా వ్యవసాయ మార్కెట్ యార్డులో దాదాపు 80శాతం పనులు పూర్తయినప్పటికీ మిగిలిన 20శాతం పనులు పూర్తి చేయకపోవడంతో అది నిరుపయోగంగానే మారింది. కాశ్మీర్‌గడ్డ కూరగాయల మార్కెట్‌కు రద్దీ పెరుగడంతో ఆ మార్కెట్‌ను కూల్చివేసి అదే స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. అలాగే తాత్కాలికంగా మార్కెట్ సమీపంలో నిర్మించిన దుకాణాల సముదాయాలను కూడా ప్రారంభించక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. రైతులు, కూరగాయలు, పూలు, పండ్లు, చేపలు, మాంసం అమ్ముకునే వారు రోడ్లపైనే విక్రయాలు చేపడుతున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ భవనాన్ని నిర్మించి ఆధునిక హంగులతో పూర్తిచేస్తామని ప్రకటించినప్పటికీ అది అసంపూర్తిగానే వదిలివేయడంతో పాత భవనంలోనే అభ్యాసకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతీయువకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో అత్యాధునిక హంగులతో మినీ, మెయిన్ ఆడిటోరియంలను నిర్మించే పనులను ప్రారంభించి రెండేళ్లు పూర్తవుతున్నా పూర్తి చేయలేదు. ఇక స్మార్ట్ తరగతి గదుల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశారు. జిల్లా కేంద్రంలోనే ఏకైక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హాస్పిటల్‌లైన్‌లో ఉండగా నిజాం కాలం నాటి ఆ పాఠశాల తరగతి గదులు, వంటగదులు, భోజనశాల శిథిలావస్థకు చేరుకుంది. స్మార్ట్‌సిటీలో ఆ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు గత ఏడాది పనులు ప్రారంభించి వదిలిపెట్టారు. దీనితో శిథిలావస్థలో అసౌకర్యాల మధ్య ఉన్న పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా, చెట్ల కింద తరగతులను నిర్వహిస్తున్నారు. నగరంలో 52 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుండగా వాటిలో 27 పాఠశాలలను స్మార్ట్‌సిటీలో, మిగిలిన 25 పాఠశాలలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు..మన బడి పథకంలో చేర్చి అభివృద్ధి చేస్తామని ప్రకటించగా ఇంకా 15 స్కూల్స్ అభివృద్ధి చేయలేదు. స్మార్ట్‌సిటీలో ఇలాంటి అనేక పనులు పెండింగ్‌లో

(మిగతా 6వ పేజీలో)

● రూ.30 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్ పెండింగ్

ఇప్పటి వరకు స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో 934 కోట్లతో 47 పనులను చేపట్టేందుకు నిర్ణయం తీసుకోగా దాదాపు 800 కోట్ల రూపాయల విలువ చేసే 33 పనులు పూర్తయ్యాయి. వీటిలో కేంద్ర ప్రభుత్వం 429 కోట్లను విడుదల చేయగా, రాష్ట్ర ప్రభుత్వం 429 కోట్లను మ్యాచింగ్ గ్రాంట్‌గా ఇవ్వాల్సి ఉండగా 399 కోట్లను మంజూరు చేసింది. ఇంకా 30 కోట్లరూపాయలను ఇవ్వాల్సి ఉంది. దీనితో అసంపూర్తి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని తెలిసింది. 934 కోట్లలో మిగిలిన 70కోట్ల రూపాయలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తే తప్ప పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

పదో తరగతి బాలికలందరికీ సైకిళ్లు

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి బాలికలందరికీ సైకిళ్లు అందిస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని టీఎన్‌జీవో హాలులో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం ద్వారా వంద మంది బాలికలకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు భారం కాదని, కుటుంబానికి సమాజానికి భరోసా అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కిశోరశక్తి, బేటీ బచావో బేటీ పడావో, జన్మోత్సవ్, ముద్ర యోజన వంటి పథకాలు ఆడపిల్లల కోసం ప్రవేశపెట్టిందన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివే ఆడ పిల్లలకు సైకిళ్లు అందిస్తామన్నారు. బాలికల వసతి గృహాల్లో వాషింగ్ మిషన్‌లు అందిస్తాన్నారు. పథకాల లక్ష్యాన్ని చేరే విధంగా అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ బేటీ పడావో పథకంలో భాగంగా పాఠశాలకు దూరంగా ఉండి సైకిల్ లేని వారిని గుర్తించి వంద మందికి సైకిల్ అందజేస్తున్నామన్నారు. ఇందులో 30 సైకిళ్లను స్టేట్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా అందజేసింద న్నారు. జిల్లాలో స్నేహిత కార్య క్రమం ద్వారా కెరియర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సంక్షేమ పథకాలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంథుల పాఠ శాలలో వాషింగ్ మిషన్లు అందించా మన్నారు. జిల్లాలో పదో తరగతి మధ్యలో ఆపేసిన 110 మంది విద్యార్థులను గుర్తించి వారందరికీ పరీక్ష రాయించామన్నారు. 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. మహిళా సమ స్యల పరిష్కారం కోసం శుక్రవారం సభ నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ఆడపిల్లల స్వీయ రక్షణకు పోలీస్ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆడపిల్లలకు విద్య ఎంతో అవసరమని, చదువుతో బాలికలు తమ లక్ష్యాన్ని చేరుకో వచ్చన్నారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు, గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ శోభారాణి, జిల్లా సంక్షేమాధికారి సబిత, ఎస్బీఐ ఏజీఎం ఎస్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

విద్యార్థులకు ఉపయోగకరంగా ఏఐ టెక్నాలజీ

- కలెక్టర్ పమేలా సత్పతి



ఆసిఫ్‌నగర్‌లో ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించిన అనంతరం పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):ఏఐ టెక్నాలజీ విద్యా ర్థులకు ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కొత్తపల్లి మండ లంలోని ఆసిఫ్‌నగర్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిం చిన అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తం గా 18 పాఠశాలలను కంప్యూటర్ ల్యాబ్‌ల ప్రారంభానికి ఎంపిక చేశామన్నారు. పలు సబ్జెక్టుల్లో వెనుబడిన 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఏఐ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏఐలో ఉన్న విషయ పరిజ్ఞానంతో విద్యార్థు లకు చక్కటి అవగామన వస్తుందన్నారు. త క్కువ సమయంలో ప్రత్యక్షంగా విద్యార్థులు విషయాన్ని నేర్చుకునే అవకాశం ఉంటుంద న్నారు. ఏఐ టెక్నాలజీ ద్వారా విద్యార్థుల పరిజ్ఞానాన్ని అంచనా వేసి సాఫ్ట్‌వేర్ బోధన అంశాలను నేర్పుతుంద న్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా విద్యాధికారి జనార్ధన్, కో-ఆరి నేటర్ అశోక్‌రెడ్డి, ఎంఈఓ ఆనందం, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● విద్యతో లక్ష్యాన్ని సాధించవచ్చు

తిమ్మాపూర్ : విద్యతో అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థులకు సూచించారు. శనివారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న 72 మంది విద్యార్థులను గుర్తించి వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేసి మాటా డారు. పాఠశాలలో అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అర్థం కాని విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలు సుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధి కారి వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి షాజిత, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుజాత, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

కరీంనగర్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ, ఉపాధి హామీ, జిల్లా పరిషత్తు అభివృద్ధి పనులపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భవనాల మరమ్మతులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రా లకు సంబంధించిన పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. వేసవిలో మంచినీటి సరఫరా కోసం అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ డిఆర్‌డిఓ శ్రీధర్, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏఈలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- సీపీ గౌస్ ఆలం

హుజూరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. శనివారం హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని, పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్‌లు పూల మొక్కను అందించారు. ఈ మేరకు పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి, త్వరిగతిన పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న పనితీరు, వారికి ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ కేసుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొని జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉంటూ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు. లా అండ్ ఆర్డర్ సమస్యలపై పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకొని త్వరగా పూర్తి చేయాలన్నారు. రౌడీ, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హోల్స్‌గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి, ఆడేవారిని పట్టుకొని, తగిన కేసులు నమోదు చేసి వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. అలాగే రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో సీపీ గౌస్ ఆలంకు పూల మొక్కను అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హోలీలో హుషారుగా.. కాసేపటికే గుండెపోటు

● ఆసుపత్రికి తరలించేలోపే మహిళ మృతి


జ్యోతి(ఫైల్)

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తోటి మహిళలతో హుషారుగా హోలీ వేడుకల్లో పాల్గొని వారితో కలిసి సంబరాలు చేసుకొని ఇంటికి వెళ్లిన ఓమహిళ కాసేపటికే గుండెపోటుతో మృతి చెందడం విషాదంగా మారింది. ఆడుతూ.. పాడుతూ తమతో ఉన్న మహిళ గంటల వ్యవధిలోనే మృతిచెందడం తోటివారిని కంటతడి పెట్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలం రామన్నపేటకు చెందిన సిరిమల్ల జ్యోతి అలియాస్ రమ(40) అనే మహిళ హోలీ పండగ సందర్భంగా శుక్రవారం రాత్రి తోటిమహిళలతో కలిసి రాత్రి11గంటలవరకు వేడుకల్లో పాల్గొని తరువాత ఇంటికి వెళ్లింది. భోజనం చేసి పడుకున్న కాసేపటికే చాతిలో నొప్పి అని తెలపడంతో కుటుంబసభ్యులు చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో కుటుంబంలో, గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

హోలీ వేడుకలో విషాదం

● స్నానానికి వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి

ముత్తారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామంలో హోలీ వేడుకలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ముదురుకోళ్ల సమ్మయ్య (45)శుక్రవారం హోలీ అనంతరం స్నానం చేయడానికి లక్కారం చెరువు వద్దకు వెళ్ళి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. హోలీరోజు గ్రామంలో పలువురి వద్ద డబ్బులు అడుక్కొని మద్యం సేవించి స్నానం చేయడానికి వెళ్లి చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రెడ్డిరామయ్యపల్లి స్టేజీ వద్ద శుక్రవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో రామడుగుమండలం వెదిర గ్రామానికి చెందిన మల్యాల సత్తయ్య(55) మృతిచెందాడు. పోలీసుల వివరాలప్రకారం.. మల్యాల సత్తయ్య రాత్రి 11:30 గంటలకు వెదిర నుంచి కరీంనగర్‌కు బైక్‌పై వస్తున్నాడు. రెడ్డిరామయ్యపల్లి స్టేజీవద్ద ఎదురుగా వచ్చిన బైక్ అతివేగంగా ఢీకొట్టింది. సత్తయ్య ఎగిరిరోడ్డుపై పడడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సత్తయ్య భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్తపల్లి మెడికల్ కళాశాల వద్ద..

కరీంనగర్ క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మెడికల్ కళాశాల వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రేకుర్తికి చెందిన సుతారి అక్కపెల్లి భూమయ్య(48) అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. భూమయ్య తన ద్విచక్రవాహనంపై రేకుర్తికి వస్తున్నాడు. మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో జగిత్యాల నుంచి కరీంనగర్‌కు వస్తున్న కారు అతివేగంగా భూమయ్య బైక్‌ను వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన భూమయ్య మృతి చెందాడు. భూమయ్య భార్య ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌కు చెందిన రాజేష్‌గుప్తా(28) అనేవ్యక్తి పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. కరీంనగర్‌రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. రాజేష్‌గుప్తా రెండేళ్లుగా నగరంలోని కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటూ కార్పెంటర్ వద్ద పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై కరీంనగర్ నుంచి వల్లంపహాడ్ గ్రామానికి వెళ్తున్నాడు. తీగలగుట్టపల్లి వద్ద కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. దీంతో రాజేష్‌గుప్తకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. రాజేష్ గుప్తా బంధువు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఐకేపీ ఉద్యోగి మృతి


కుమారస్వామిగౌడ్(ఫైల్)

అంతర్గాం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద లారీఢీకొని ఐకేపీ ఉద్యోగి మేరుగు కుమార స్వామి గౌడ్ మృతిచెందాడు. పెద్దంపేట గ్రామానికి చెందిన మేరుగు కుమార స్వామిగౌడ్(43) ద్విచక్రవాహనం టీఎస్ 02ఈఈ 0265పై పాలకుర్తి మండలానికి విధులకు వెళుతున్నాడు. బసంతనగర్ నుంచి అంతర్గాం వైపు వేగంగా వెళుతున్న ఏపీ20టీబీ5994 నంబర్‌గల లారీ బ్రాహ్మణపల్లి మూలమలుపు వద్ద ఢీకొట్టడంతో కుమారస్వామికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనస్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖనిలోని ప్రభుత్వ ఏరియాఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య శైలజ, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి, పెద్దంపేట గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, న్యూడెమోక్రసీ నాయకులు కొల్లూరి మల్లేష్, మేరుగు చంద్రయ్యలు మృతుడి కుటుంబీకులను ఓదార్చారు.

రైలు ఎక్కబోతూ రైల్వే ఉద్యోగి మృతి

జమ్మికుంట రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట రైల్వే స్టేషన్లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు జారిపడి కొంరయ్య అనే రైల్వే ఉద్యోగి శనివారం మృత్యువాతపడ్డాడు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సోమిడి గ్రామానికి చెందిన కొంరయ్య బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ పరిధిలో గ్యాంగ్‌మేన్ విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులు ముగించుకొని రైలు ఎక్కేందుకు జమ్మికుంటకు వచ్చాడు. దానాపూర్ ఎక్స్‌ప్రెస్ జనరల్‌బోగిలో ఎక్కుతున్న క్రమంలో కాలుజారి ప్లాట్‌ఫామ్ మీద పడి అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపారు.

ఎన్టీపీసీలో యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణకాలనీలో శనివారం దయా ప్రసన్నకుమార్(29) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు వైరుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాల వల్లనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

దివ్యాంగులకు యూడీఐడీ స్మార్ట్‌కార్డులు

● అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు
● వన్‌నేషన్, వన్‌డిసెబులిటీపై కేంద్రం కసరత్తు



సుభాష్‌నగర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): వన్‌నేషన్, వన్ డిసెబులిటీలో భాగంగా దేశంలోని వికలాంగులందరికీ ఒకే రకమైన కార్డులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ కార్డులను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం వైకల్య నిర్ధారణకు సదరం సర్టిఫికెట్ ఇస్తున్నారు. దానికి కూడా కాలపరిమితి ఉటుంది. ఈ సమస్యలేవి లేకుండా యూడీఐడీ (యూనిక్ డిసెబిలిటీ ఐడీ) నంబరును కేటాయించి స్మార్టు కార్డులు జారీ చేయనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా పోర్టల్‌ను ప్రారంభించి దివ్యాంగులే నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. సమగ్ర వివరాలతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటో, సంతకం లేదా ఆధార్ కార్డు తదితర గుర్తింపు కార్డులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి సదరం శిబిరం నిర్వహించే కేంద్రాల్లో దగ్గర ఉండే దానిని ఎంచుకోవాలి. అక్కడ ఏ రోజు సదరం నిర్వహిస్తారో మొబైల్ ఫోనుకు మెసేజ్ పంపిస్తారు. అక్కడికి వెళ్తే డాక్టర్లు వారి వైకల్యాన్ని నిర్ధారించి ఎంత శాతం ఉందనేది పోర్టల్‌లో నమోదు చేస్తారు. కొత్తవారితో పాటు ఇప్పటికే సదరం సర్టిఫికెట్ పొందిన వారికి కూడా స్మార్టు కార్డులు జారీ చేస్తారు. స్మార్ట్ కార్డుల కోసం మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకొని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించే సదరం శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. వివరాలన్నీ సరిగ్గా ఉన్నాయని డాక్టర్లు నిర్ధారించి స్మార్ట్ కార్డు మంజూరు చేస్తారు. డిజిటల్ సంతకంతో కూడిన స్మార్ట్ కార్డు పోస్టు ద్వారా దివ్యాంగుడి ఇంటి అడ్రస్‌కు పంపిస్తారు. కార్డులో ఐడీ నంబరు, దివ్యాంగుడి పేరు, వైకల్యం రకం, ఎంతశాతం ఉంది అనే వివరాలు అందులో ఉంటాయి.

● కార్డుతో బహుళ ప్రయోజనాలు

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న యూడీఐడీ కార్డుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. సదరం శిబిరంలో వికలాంగత్వం నిర్ధారణ అయిన తర్వాత అర్హులైన వారికి అధికారులు కార్డు మంజూరు చేస్తారు. ఈ కార్డు ఆధార్‌తో లింక్ చేయబడి ఉండటంతో వికలాంగులకు కేంద్రం అందించే సంక్షేమ పథకాలు ఏ మేరకు అందుతున్నాయే పరిశీలించే అవకాశం ఉంటుంది. ఈ కార్డు బస్సులు, రైళ్ల టికెట్లపై రాయితీలు, పింఛన్ వంటి ప్రయోజనాలు పొందవచ్చు. దేశంలో ఎక్కడైనా ఈ కార్డుని ఉపయోగించుకోవచ్చు. వికలాంగుల సామాజిక, ఆర్థిక విషయాలు ఈ కార్డు ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది. వికలాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే అన్ని పథకాలకు యూడీఐడీ కార్డు కీలకంగా మారనుంది.

స్వగ్రామానికి చేరుకున్న రంగపేటవాసి


మధుకర్‌రెడ్డి

మానకొండూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగపేటకు చెందిన మయన్మార్ బాధితుడు కొక్కిరాల మధుకర్‌రెడ్డి శనివారం స్వగ్రామానికి చేరుకున్నాడు. బాధితుడి అనుభవాలు ఆయన మాటల్లోనే.. మధుకర్‌రెడ్డి గత సంవత్సరం డిసెంబరు17న థాయ్‌లాండ్‌కి బతుకుదెరువు కోసం వెళ్లాడు. అక్కడి నుంచి మయన్మార్ దేశంలో ఉద్యోగం కల్పిస్తామని రాజశేఖర్ అనేవ్యక్తి తీసుకెళ్లాడు. రాజశేఖర్.. మధుకర్‌రెడ్డిని చైనాకు చెందిన ఓ కంపెనీకి అమ్మివేయడంతో మోసపోయాడు. ఇండియాకు చెందిన సుమారు వెయ్యి మంది అక్కడే ఉన్నారని కరీంనగర్ ఎంపీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చొరవతో నాతో పాటు 540మంది ఇండియాకు రాగా మరో 460మంది అక్కడే చిక్కిపోయారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో దొంగతనం

● 23 ట్యాబ్‌ల అపహరణ ● సంఘటనా స్థలాన్ని సందర్శించిన రూరల్ ఏసీపీ


పగులకొట్టిన వెటిలేటర్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ శుభం ప్రకాశ్

మానకొండూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు 23ట్యాబ్‌లను ఎత్తుకెళ్లిపోయారు. పీఎం శ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద పాఠశాలకు ఇటీవల ఒకటి రూ.15వేల చొప్పున రూ.3.80లక్షలతో 25ట్యాబ్‌లను కేంద్రప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం హోలీ పండుగ కావడంతో పాఠశాలకు సెలవు ఉంది. దొంగలు మొదటగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడి గది వెనకాల ఉన్న వెంటిలేటర్‌ను పగులకొట్టి గదిలోకి దూరారు. ఆ గదిలోని ఓ బీరువాలో ఉన్న తాళాలు తీసుకొని దాని ప్రక్కన ఉన్న మరోగది వెనకాలకు వెళ్లి దాని వెంటిలేటర్‌ను పగులకొట్టి ఆ గదిలోకి దూరారు. మొదటి రూంలో నుంచి తెచ్చుకున్న తాళాల సహాయంతో బీరువాలో ఉన్న 23ట్యాబ్‌లను ఎత్తుకెళ్లారు. మరో రెండు ట్యాబ్‌లు హెచ్‌ఎం బీరువాలో ఉన్నాయి. శుక్రవారం హోలీ పండుగ కావడంతో శనివారం నుంచి ఒంటిపూట బడి ప్రారంభం అయింది. ఉదయం 7.30గంటలకు సిబ్బంది పాఠశాలకు రావడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్‌తోపాటు క్లూస్ టీం సీఐ స్వర్ణజ్యోతి సమాచారమివ్వగా వారువచ్చి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. రెండు గదులలోని బీరువాలు, తాళం చెవిలు, రెండు గదుల వెనకాల పగులకొట్టిన వెంటిలేటర్‌లను పరిశీలించారు. బీరువాలతోపాటు తాళం చెవిలు, గోడల వద్ద ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. అనంతరం పాఠశాల సిబ్బందితోపాటు ఉపాధ్యాయుల ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. పాఠశాలకు చెందిన విద్యార్థుల హస్తంతోనే దొంగతనం జరిగి ఉండవచ్చనే అనుమానాలు బలంగా ఉన్నాయి. రెండు, మూడు రోజుల్లో దొంగలు బయటపడే అవకాశాలు ఉన్నాయి. కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు పట్టాల పక్కన యువజంట మృతదేహాలు

● ప్రేమ జంటగా అనుమానం ● ఘటనపై అనుమానాలు


రైల్వే ట్రాక్‌పై మృతదేహాలు

జమ్మికుంట,మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్-పాపయ్యపల్లి గ్రామాల రైల్వేట్రాక్ మధ్య ఓ యువజంట అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నది. వారు ప్రేమ జంట అయి ఉండవచ్చని, గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతి చెందిన యువకుడు ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన మెనుగు రాహుల్ (18)గా గుర్తించారు. ఇతను హైదరాబాద్‌లోని ఓ బేకరీలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం స్వగ్రామం రాచపల్లికి వచ్చాడు. శనివారం సాయంత్రం 4 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. ఫోన్ డిస్‌ప్లే ధ్వంసం కావడంతో యువతి వివరాలు తెలియరాలేదు. ప్రమాదంలో ఇద్దరి తలలకు మాత్రమే దెబ్బలు తగిలి ఉన్నాయి. ఒంటిపై ఎక్కడా గాయాలు లేవు. యువకుడి ముఖం కంకర రాళ్లలోకి చొచ్చుకుపోయి ఉంది. యువతి తలకు తీవ్రంగా గాయమైంది. ఒక సెల్‌ఫోన్ పక్కన పడి ఉండగా, మరొక సెల్ పూర్తిగా ధ్వంసం అయింది. మృతదేహాలు ఒక దగ్గర పడి ఉన్నాయి. రైలు కింద పడితే కొంత దూరం అయినా లాక్కు వెళ్లే అవకాశాలు ఉంటాయి. యువతి మెడకు చున్నీ చుట్టి ఉంది. దీంతో మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యువజంట రాత్రి వేళలో అటు వైపు ఎలా వచ్చారనేది తెలియాల్సి ఉంది. అటువైపు రావాలంటే పాపయ్యపల్లి గ్రామ రైల్వే క్యాబిన్ నుంచి రావాల్సి ఉంటుంది. ఏదైనా వాహనం మీద వచ్చినా అక్కడే పెట్టి నడుచుకుంటూ వచ్చి ఉండాలి. హత్యా.. ఆత్మహత్యా అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రైల్వేపోలీస్‌లు కేసు నమోదు చేశారు.

ముచ్చటగా.. మూడోపెళ్లి..

● పెట్రోల్‌పోసి నిప్పటించిన మొదటి భార్య, కుమారులు
● చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


కమలాకర్ (ఫైల్)

జగిత్యాలరూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పొలాసగ్రామంలో పడాల కమలాకర్(60) అనేవ్యక్తి మూడో పెళ్లి చేసుకోగా మొదటి భార్య, కుమారులు పెట్రోల్‌పోసి శనివారం నిప్పంటించారు. తీవ్రంగా గాయపడిన కమలాకర్‌ను ఆస్పత్రికి తరలించగా శనివారంరాత్రి చికిత్సపొందుతూ మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పడాల కమలాకర్ పొలాస గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గతంలోనే కమలాకర్ రెండు పెళ్లిళ్లు చేసుకోగా ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంవత్సరంక్రితం కమలాకర్ మూడోపెళ్లి చేసుకొని గ్రామంలో మూడోభార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మొదటి భార్య, కుమారులను తరుచూ మద్యం తాగివచ్చి వేధించేవాడు. దీంతో కమలాకర్‌పై కోపం పెంచుకున్న మొదటి భార్య పడాల జమునతోపాటుకుమారులు పడాల చిరంజీవి, పడాల రంజిత్, కూతురు శిరీష, అల్లుడుశోభన్‌బాబు శనివారం ఉదయం కమలాకర్ నివాసం ఉంటున్న ఇంటికివెళ్లి గొడవ పడ్డారు. ఈక్రమంలో కమలాకర్‌పై కత్తులతో దాడిచేసి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పటించారు. దీంతో తీవ్రంగా గాయపడిన కమలాకర్‌ను స్థానికులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. శరీరభాగాలు పూర్తిగా కాలిపోవడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు కమలాకర్ సోదరుడు పడాల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

మెట్‌పల్లిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొచ్చి మెట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్న నలుగురు సభ్యులు గల ముఠాను అరెస్టు చేసి, వీరి వద్ద 450 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎలిగేడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జూలపల్లి పోలీస్‌స్టేషన్‌పరిధిలోని ఎలిగేడులో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకొని వారి రూ.6600నగదు, 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. హెచ్‌సి శాంతయ్య, కానిస్టేబుల్‌లు మనోహర్, పవన్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన యువకుడి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామానికిచెందిన యువకుడు గడ్డి నవీన్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. ఈ నెల14న రాత్రి రాచర్లగొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో పండ్ల దుకాణ యజమాని హమీద్‌తో యువకుడు నవీన్ గొడవకు దిగాడని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్‌శ్రీనివాస్‌రావు అక్కడకు చేరుకుని శాంతింపజేయడానికి ప్రయత్నిస్తే నవీన్ ఎదురుతిరగడంతోపాటు చేతులతో నెట్టివేశాడని వివరించారు. బ్లూకోల్ట్స్ విధులు నిర్వహిస్తున్న ఆసిఫొద్దిన్, నర్సింలుకు విషయం చెప్పడంతో చేరుకున్నారన్నారు. యువకుడు నవీన్‌ను శాంతింపజేసిన పట్టించుకోకుండా విధులకు ఆటంకం కలిగించడంతోపాటు తమను నెట్టివేశాడని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ రావు ఫిర్యాదుతో కేసునమోదు చేశామని చెప్పారు. అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజుల పాటు జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

● పలువురు పదో తరగతి విద్యార్థులకు గాయాలు


చిన్నకలువల వద్ద లారీని ఢీ కొన్న విద్యార్థుల ఆటో

సుల్తానాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ నుంచి పెద్దపల్లి వెళుతున్న ఆటో రోడ్డుపై నిలిపి ఉన్న ఓ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సుల్తానాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ స్కూల్‌కు చెందిన పదోతరగతి విదార్థులు స్కూల్ ముగిసిన తర్వాత ఆటోలో పెద్దపల్లిలోని ఇండ్లకు వెలుతున్నారు. చిన్నకలువల వద్ద ఆటో అదుపు తప్పి రాజీవ్ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ సంఘటనలో పసునూటి సాయిచరణ్, అప్పాల అభిరామ్, రేవెల్ల ఆదిత్య, వినుకొండ విశాల్, గుండేటి వర్షిత్ అనే విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. వీరంతా పెద్దపల్లికి చెందినవారే. సంఘటనా సమాచారం అందుకున్న పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డవారిని పెద్దపల్లి ఆసపత్రికి తరలించారు. ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన వేములవాడ మున్సిపల్‌పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన రేగుల హన్మంతు బైక్‌పై వేములవాడకు వెళుతున్నాడు. అదేక్రమంలో చెరుకుబండి ఎదురుగా వచ్చింది. ఈ రెండు ఎదురెదురగా ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో హన్మంతుకు తీవ్రగాయాలు కాగా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

చీరల ఉత్పత్తిలో వేగం పెంచాలి: టెక్స్‌కో జీఎం


మాట్లాడుతున్న టెక్స్‌కో జీఎం అశోక్‌రావు

సిరిసిల్ల రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వశక్తిసంఘాల మహిళలకు పంపిణీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చే చీరలఆర్డర్‌లను తీసుకుని ఉత్పత్తిలో వేగం పెంచడంతోపాటు సకాలంలో తయారుచేసి అందించాలని టెక్స్‌కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు కోరారు. సిరిసిల్లలో శనివారం చీరల తయారీపై యాజమానులు, ఆసాములతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అసాముల, యాజమానులకు చీరలతయారీ ఆర్డర్‌కాపీలను అందించారు. ఈకార్యక్రమానికి హాజరైన జీఎంఅశోక్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం తయారు చేయిస్తున్న చీరలను నాణ్యతతో ఉండేలాచూసి సకాలంలో అందించాలన్నారు. వేములవాడలో ఏర్పాటుచేసిన యారన్ డిపో నుంచి చీరలకు సంబంధించిన యారన్‌నుతీసుకోవాలని సూచించారు. ఇక్కడి వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలను యాజమానులు, ఆసాములు జీఎంకు విన్నవించగా, సమస్యలను చేనేత జౌళిశాఖ కమిషనర్ దృష్టికితీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ సీజీఎం ఎన్ వీ వెంకటరమణ, సిరిసిల్లఏడీరాఘవరావు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్న ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గతంలో పీఆర్వోగా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్‌ను దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శనివారం తెలిపారు. రాజన్న ఆలయంలో 2016-17 సంవత్సరానికిగాను వివిధ టీవీ, దినపత్రికలకు ప్రకటనలు ఇవ్వడంలో భాగంగా రూ.28లక్షలలో కొంతమేర బిల్లులు లేకపోవడంతో అవినీతి జరిగినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారని, దాని ఆధారంగా సదరు ఉద్యోగిని సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం కొండగట్టులో విధులు నిర్వర్తిస్తుండటంతో అక్కడి ఈవోకు ఉత్తర్వులను పంపించినట్లు ఆలయ ఈవో పేర్కొన్నారు.

ఆలయ ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలి: ఈవో

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులతో కాంట్రాక్టర్‌లు, ఉద్యోగులు సత్ప్రవర్తనగా వ్యవహరించాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా ఉంటూ ఆలయ ప్రతిష్ఠతను పెంచేలా విధులు నిర్వర్తించాలని ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. రాజన్న ఆలయంలోని పలు విభాగాలను శనివారం తనిఖీ చేశారు. రాజన్న ఆలయముందు భాగంలో కొబ్బరికాయలు, బెల్లం దుకాణాన్ని పరిశీలించారు. బెల్లం దుకాణాల్లోని రికార్డులను పరిశీలించి బెల్లం నాణ్యతను, తూకాన్ని పరిశీలించారు. రాజన్న భక్తులను మోసం చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. కొబ్బరికాయలు కొట్టేవద్ద అపరిశుభ్రంగా కనిపించడంతో వాటిని వెంటనే తొలగించాలని, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, సీనియరల్‌అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, ఎఫ్‌సీఎఫ్‌అధికారి కరణ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉగ్ర నారసింహుడి డోలోత్సవం



ఉగ్ర నారసింహుని డోలోత్సవం

ధర్మపురి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో ఉగ్రనారసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆస్థాన వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి బ్రహ్మ పుష్కరిణికి తీసుకువచ్చారు. అనంతరం హంసవాహన రూపంలోని పడవపై స్వామివారలను కూర్చో బెట్టి, బ్రహ్మపుష్కరిణిలో ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. భక్తులు నరసింహ నామస్మరణలు చేస్తూ మెట్లపైన ప్రదక్షిణలు చేయగా కొందరుమహిళలు త్రిశూలం చేతబట్టుకుని పూనకాలతో స్వామివారలను కొలుస్తుండగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం స్వామివారల సేవలను బ్రహ్మపుష్కరిణిమధ్య గల మండపంలోని ఊయలపై ఆసీనులను చేశారు. సనాతన సాంప్రదాయరీతిలో అర్చకులు స్వామివారల డోలోత్సవం నిర్వహించారు. భక్తులు వెళ్లి స్వామివారలపై బుకాగులాలు చల్లి కట్నకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన భక్తులు డోలోత్సవం తిలకించిన అనంతరం నెత్తిమీద ముల్లెమూట పెట్టుకుని తిరుగు ప్రయాణం పట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, శ్రీధర్, ఉమాసాగర్, సతీష్, దత్తాత్రి, కుమారస్వామి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



ఉగ్ర నారసింహుని తెప్పోత్సవం

హలీం.. సలాం..

- సర్వజనులకు ఎంతో ప్రియం..
- రంజాన్ మాసం.. నోరూరించే రుచులు
- అరబ్ దేశాల నుంచి తెలంగాణకు..
- జిల్లా ప్రధాన కూడళ్లలో ప్రత్యేక స్టాళ్లు
- అదివారం ప్రత్యేకం



చికెన్ మంచూరియా

డబుల్‌కా మీఠా

హలీమ్

హలీమ్ తయారు చేస్తున్న మాస్టర్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రంజాన్ మాసం వచ్చిందంటే ఎక్కడ చూసినా హలీమ్ ఘుమఘు మలు నోరూరిస్తాయి. ముస్లింలే కాదు సర్వజనులకు హలీమ్ ఎంతో ప్రియమైనదిగా భావిస్తారు. వీటితో పాటు రంజాన్ సందర్భంగా తయారుచేసే వంటకాల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కూడళ్లలో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం నుంచే హలీమ్ రుచులతో పాటు చికెన్ మంచూరియా, చికెన్ కర్రీ, తందూరి చికెన్, డబుల్‌కా మీఠా, రుమాల్ రోటి వంటి రుచులను నిర్వాహకులు అందిస్తున్నారు. రంజాన్ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

హైదరాబాద్ నుంచి చిన్న నగరాలకు రంజాన్ రుచులు..

ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన హలీమ్‌కు మన హైదరాబాదే ప్రసిద్ధిగాంచింది. రుచుల పరంగా కాకుండా కేలరీల పరంగా కూడా హలీమ్ ఎంతో ముఖ్యంగా చెప్పుకుంటారు. రోజా రోజుల్లో అందే రుచుల్లో ముఖ్యంగా ఉండే హలీమ్ అరబ్ దేశాల నుంచి తెలంగాణకు వచ్చి వందేళ్లు పూర్తి చేసుకుంది. మారుతున్న ప్రజల ఆహార అలవాట్లకు అనుగుణంగానే హలీమ్‌ను కూడా రకరకాల వెరైటీలతో హోటల్ యజమానులు తయారు చేస్తున్నారు. 1866-1911 మధ్య కాలంలో నాటి నిజాం నవాబు తమ వంటశాలలో దీనిని ప్రత్యేకంగా తయారుచేయించి అతిథులకు వడ్డించేవారని చరిత్ర చెబుతోంది. హలీమ్ విక్రయ కేంద్రాలు మాత్రం 50 ఏళ్ల క్రితం మాత్రమే మొదలయ్యాయి.

హలీమ్ ఇప్పుడు చిన్న చిన్న నగరాల్లో సైతం లభిస్తోంది. ఇప్పటికీ రుచికర

హలీమ్ చరిత్రలోకి వెళితే...

వంద సంవత్సరాల క్రితం నిజాం రాజు తన వ్యక్తిగత సైన్యం కోసం యెమెన్, సౌదీ, అరబ్ దేశాల నుంచి రక్షక భటులను తెప్పించుకునేవారు. వారు ఇక్కడికి వచ్చిన తరువాత రోజూవారి ఆహారం కాకుండా ప్రత్యేకంగా తయారు చేయడానికి వంట మనుషులు కూడా వచ్చారు. వచ్చిన వారు సైనికులు ఎక్కువసేపు ఆహారం లేకుండా ఉండేందుకు గోధుమలు, నెయ్యి, మాంసంతో ఒక పదార్థాన్ని తయారుచేసేవారు. దానిని అప్పుడు హరీస్‌గా పిలిచేవారు. స్వచ్ఛమైన గోధుమలు, నెయ్యి, మాంసాన్ని సమభాగంలో ఉడికించి తినేవారు. కాలానుగుణంగా ఇక్కడే ఉండిపోయిన అరబ్బులు, నిజాం పండుగ వేడుకల్లో కూడా హరీస్‌ను తయారు చేయించి వడ్డించేవారు. నిజాం రాజవంశీకుల ఇండ్లతో పాటు ప్రస్తుతం దేశవ్యాప్తంగా హరీస్, హలీమ్ వంటకాలు ప్రసిద్ధి చెందాయి.

● వెజిటేరియన్ హలీమ్...

శాఖాహారులకు కూడా వెజిటేరియన్ హలీమ్ అందుబాటులోకి తెచ్చారు. ఫిష్ హలీమ్ తయారు చేసే విధానంలోనే దీనిని తయారు చేస్తారు. గోధుమరవ్వతో పాటు కొద్దిపాటి మసాలాను వినియోగిస్తారు. వండిన తరువాత చివరలో బీన్స్, క్యారెట్, కీరా, పచ్చి బఠానీలు కలిపి ఉడికిస్తారు. ఘాటుగా ఉండకుండా పెరుగుతో పాటు పాలు కలుపుతారు.

● జాఫ్రానీ హలీమ్...

జాఫ్రానీ హలీమ్‌లో గోధుమలు, మాంసం, నెయ్యితో పాటు కుంకుమపువ్వు వాడుతారు. దీంతో ఇది సుగంధం వెదజల్లుతుంది. అవసరమయిన వాళ్లు దీనిని ప్రత్యేకంగా తయారు చేయించుకుంటారు. ఎక్కువగా తింటే వేడి చేసే అవకాశం ఉంది.

● దక్కన్ హలీమ్...

నిజాం కాలంలో అరబ్బులు తయారు చేసే హలీమ్‌ను దక్కన్, దక్కని పేర్లతో పిలిచేవారు. ఇందులో గోధుమలతో పాటు మాంసం మోతాదు రెండు నుంచి మూడింతలు వేస్తారు. గరం మసాలాతో పాటు లవంగం, ఇలాచీ, పప్పుదినుసులు కలిపి దీనిని తయారు చేస్తారు.

● ఇరానీ హలీమ్...

పాతకాలం వారు ఇప్పటికీ ఇరానీ హలీమ్ తయారుచేస్తున్నారు. ఇరానీ హలీమ్ ఘాటుగా ఉండదు. డ్రై ఫ్రూట్స్‌తో పాటు గోధుమలు, మినప పప్పు, తక్కువ మోతాదులో మసాలా దినుసులు వినియోగిస్తారు. ఈ హలీమ్ ఎక్కువగా పేస్ట్‌లా కాకుండా చిన్నచిన్న గింజలుగా ఉంటుంది.

● మటన్ హలీమ్...

గోధుమలు, మటన్‌తో పాటు శనగపప్పు, మినప పప్పు, ఎర్రపప్పు కలిపి తయారు చేస్తారు. మసాలా దినుసులు కలిపి ఘాటుగా తయారు చేస్తారు.

● మరెన్నో ఘుమఘుమలు

రంజాన్ పర్వదినాల్లో హలీమ్, హరీస్, రుచులతో పాటు మరెన్నో వంటకాలు ఘుమఘుమలాడుతాయి. దమ్ బిర్యానీతో పాటు డబుల్‌కా మీఠా, కబాబ్, సేమియా, కుర్బానీకా మీఠా, చికెన్ టిక్కాలు, తందూరి చికెన్, రుమాలీ రోటీ, రుచులను అందిస్తారు.

20 ఏళ్లుగా హలీమ్ చేస్తున్నాను...

- ఎస్‌కే తౌఫిక్, మాస్టర్



రంజాన్ మాసంలో అందరికీ ఇష్టమైన హలీమ్, హరీష్‌తో పాటు బుల్‌కా మీఠా, కబాబ్, సేమియా, కుర్బానీకా మీఠా, చికెన్ టిక్కాలు, తందూరి చికెన్ తయారుచేస్తాను. దాదాపు 20 ఏళ్లుగా హలీమ్ తయారు చేస్తున్నాను. అందరూ బాగా ఇష్టపడుతారు.

ప్రతి రంజాన్‌కు స్టాల్ ఏర్పాటు..

- ముజీబ్, నిర్వాహకుడు



ప్రతి రంజాన్ మాసంలో హలీమ్, హరీష్ ఇతర పదార్థాలను అందించడానికి స్టాల్ నిర్వహిస్తున్నాను. అందరు ఎక్కువగా హలీమ్, హరీస్, పిల్లలు తందూరి చికెన్ ఇష్ట పడుతారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

● మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీనుంచి మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌తో కాంగ్రెస్, బీఆర్ఎస్‌డ్రామాలు ఆడుతున్నాయని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం నగరంలోని టీఎన్‌జీవో హాలులో విలేకరులతో మాట్లాడారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్‌చేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్,బీఆర్ఎస్ రెండుపార్టీలు ఎమ్మెల్సీఎన్నికల్లో బీజేపీ గెలుపును జీర్ణించుకోలేక పోయాయని, కొత్త ఎత్తుగడలు వేస్తున్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆరుగ్యారంటీలను అమలు చేయడంలేదన్నారు. కేంద్రం స్మార్ట్‌సిటీ నిధులు మంజూరు చేస్తే రాష్ట్రవాటా ఇవ్వడం లేదన్నారు. రాజాసింగ్ వ్యాఖ్యలను తాను వినలేదని, బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే రహస్యభేటీలు జరుగుతున్నాయని, ఆ రెండుపార్టీలు ఒక్కటేనని అన్నారు. ఆరుగ్యారంటీలపైనా ప్రజాసమస్యలపైనా చర్చించే దమ్ముందా? అని ప్రశ్నించారు. పది లక్షలఎకరాలు పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినహామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రుణమాఫీ, రైతుభరోసా, నిరుద్యోగభృతి, ఉద్యోగుల డీఏ, వృద్ధులకు రూ.4 వేల పింఛన్, కల్యాణలక్ష్మి తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2500, కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వంటి వాటి ఊసేలేదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, కేసీఆర్ ప్రభుత్వానికి దించి వేశారని, కాంగ్రెస్‌కు అదే గతిపడుతుందని అన్నారు. తమిళనాడులో డీఎంకేపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, అందుకే డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారని, డ్రామాలు మొదలు పెట్టారని అన్నారు. తెలంగాణతోపాటు కర్నాటకలో కాంగ్రెస్ పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. కేరళలో పరిస్థితి అలాగే ఉందన్నారు. ఆయా పార్టీలన్నీ కలిసి బీజేపీని దెబ్బతీసేందుకు చూస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్, తబ్లిగీ జమాతే సంస్థల సమావేశాల పేరుతో కోట్లుఖర్చు చేస్తున్నారన్నారని, ఇవి చేస్తే హైదరాబాద్ బ్రాండ్‌పెరుగుతుందా? అని ప్రశ్నించారు. తెలంగాణలో హైదరాబాద్‌తో సహా డ్రగ్స్‌తో పిల్లలు అల్లాడుతున్నారన్నారు. డ్రగ్స్ దందాచేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి వాటిపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. డ్రగ్స్ విక్రయాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. డ్రగ్స్ కేసుపై విచారణ లేదని, ఫోన్‌ట్యాపింగ్‌పై కేసీఆర్ పాత్ర ఉందని తెలిసినా ఎందుకు అరెస్టు చేయలేదని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ వద్ద ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో మాజీఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి, మాజీమేయర్ సునీల్‌రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుక్మిణీశ్రీకృష్ణుల కల్యాణం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం శ్రీకృష్ణ ఆలయంలో రుక్మిణీసమేత శ్రీకృష్ణ కల్యాణాన్ని యాదవ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఆరాధన, అభిషేకం,ఎదుర్కోలుమహోత్సవం, హోమం, సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. స్వామివారికి అల్లంల దేవేందర్‌స్వప్న, అల్లం కుమార్ కోమల దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య రుక్మిణీశ్రీకృష్ణ కల్యాణం నిర్వహించగా తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వ్యవసాయమార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీఎంపీపీలు గోపగోని సారయ్యగౌడ్, నూనేటిసంపత్, మాజీ జడ్పీటీసీలు తిరుపతిరెడ్డి, రాములు, జూకం టి శిరీష, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు సదయ్య, అర్చకులు అనంత శ్రీరాములశర్మ, నిఖిల్ శర్మ, లిఖిల్‌శర్మ, యాదవసంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఘనంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం



వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

ధర్మారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దొంగతుర్తి గ్రామంలోని లక్ష్మిగోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోనివివిధ గ్రామాలతోపాటు ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. జాతీయ ఎస్సీకమిషన్ సభ్యులు వడ్డేపల్లిరామచంద్రం స్వామితోపాటు నందిమేడారం ప్యాక్స్‌చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 10నుంచి మొదలైన బ్రహ్మోత్సవాలు శనివారం రథోత్సవంతో ముగిశాయి.

కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



క్యూలో వస్తున్న అంజన్న భక్తులు

తలనీలాల ద్వారా
రూ.1.46కోట్ల ఆదాయం..

మల్యాల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గతంలో కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ద్వారా సేకరించిన తలనీలాల ద్వారా దేవస్థానానికి రూ.1.46కోట్ల ఆదాయం సమకూరింది. 2023 ఆగస్టు నుంచి 2024 జూలై వరకు తలనీలాల సేకరణ టెండర్ ఖరారు కాకపోవడంతో దేవస్థానం తరుపున తలనీలాలు సేకరించగా వాటికి గాను అధికారులు ఈ ఏడాది జనవరిలో టెండర్లు నిర్వహించారు. ఇందులో కిలోకి రూ.10,300 చొప్పున హెచ్చు పాటదారు అయిన హైదరాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హేర్స్‌కు శనివారం అప్పగించారు. దీంతో దేవస్థానానికి రూ.1,46,48,866 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివకల్యాణోత్సవం

● రాజన్న ఆలయంలో ఐదు రోజులపాటు నిర్వహణ

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచిశివ కల్యాణ వేడుకలు ప్రారంభం కానున్నాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించాల్సి ఉంటుంది. అయితే రాజన్నక్షేత్రంలో మాత్రం 60యేళ్లుగా అనాధిగా వస్తున్న సంప్రదాయంతో శివమహాపురాణం, లింగ పురాణం ఆధారంగా మన్మధుడి దహనంతో ఉత్సవాలు పూర్తైన తరువాత శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణ వేడుకలు ప్రారంభమవుతాయని అర్చకులు వివరించారు. ఈనెల16నుంచి 20వరకు అంగరంగ వైభవంగా కళ్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● సోమవారం రాజన్న కల్యాణం..

శివకల్యాణ వేడుకల్లో భాగంగా ఈనెల 17వ తేదిన సోమవారం రోజున ఉదయం 10.40 గంటల నుంచి 12.55 గంటల వరకు రాజన్న ఆలయ ఆవరణలోని గెస్ట్ హౌస్ ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కల్యాణ వైభవాన్ని నిర్వహిస్తారు. 19వ తేది బుధవారం సాయంత్రం 3.05గంటలకు స్వామివారి రథోత్సవం కన్నుల పండవగా నిర్వహించనున్నారు. 20వ తేది గురువారం రోజున ఉదయం పూర్ణహుతి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఏకాంత సేవ పూజాకార్యక్రమాలతో వేడుకలు ముగియనున్నాయి.

● భక్తులకు ఇబ్బందులు
తలెత్తకుండా చర్యలు..

రాజన్న ఆలయంలో నిర్వహించే శివ కళ్యాణోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారని రాజన్న ఆలయఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశామని, భక్తుల సౌకర్యార్థం గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నామని, వేసవికాలం కావడంతో తాగునీరు, మజ్జిగప్యాకెట్లు, మధ్యాహ్నం భోజనసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి



జగిత్యాలలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి

జగిత్యాల అగ్రికల్చర్/సిరిసిల్ల రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, ఉద్యోగులపై ప్రభుత్వ విశ్వసనీయతను చాటుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ సమావేశాలు జగిత్యాల, సిరిసిల్లలో జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సెలవు జీతాలు, సప్లిమెంటరీ వేతనాలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, పెన్షన్, టీఎస్ జీఎల్ఐ తదితర బిల్లులు విడుదల కాకపోవడంతో ఉద్యోగులు, గత సంవత్సరం మార్చి నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, కమ్యూటేషన్ మొత్తాలను చెల్లించకపోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బకాయిలు పడిన నాలుగు వాయిదాల డీఏలను వెంటనే చెల్లించాలని, పీఆర్సీ నివేదికను తెప్పించి ఉద్యోగ సంఘాలతో చర్చించి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ 317జీవో బాధితులకు న్యాయం చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని రాష్ట్రంలో అన్ని జిల్లాలకు డీఈవోలను, మండలాలను ఎంఈవోల పోస్టులు మంజూరు చేయాలన్నారు. నెలాకరులోపు సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్‌లో తెలంగాణఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలకు కార్యాచరణ నిర్వహిస్తామని హెచ్చరించారు. అంతకుముందు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్‌పై మీడియాలో వచ్చిన అసత్య వార్తను జిల్లా కమిటీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని, తప్పుడు ఆరోపణలతో వేధింపులకు గురిచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి వెంకట్, కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు శ్యామ్, ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్, శ్రీనివాస్, సుశీల, ఆగమయ్య, ప్రసాద్, శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్, స్వర్ణలత, గోపి, జయంత్, సిరిసిల్లలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, సీనియర్‌నాయకులు పాకాల శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మహేందర్‌రావు, కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శి పోలాస మల్లేశం, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ప్రదర్శనలు..

● రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపేడేలా ప్రదర్శనలు ఉండాలని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించే శివకల్యాణోత్సవాలను పురస్కరించుకుని శనివారం నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకారులు తమ ప్రదర్శనలు చేయాలని సూచించారు.

భక్తులను అలరించిన
మాయాబజార్ ప్రదర్శన..

వేములవాడ రాజన్న ఆలయంలోని ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపైన ఏర్పాటు చేసిన మాయాబజాం నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన వినాయక నాట్యమండలి సురభి శ్రీదినకరు ఆధ్వర్యంలో నిర్వహించారు.



కళాకారుల మాయాబజార్ ప్రదర్శన

ఆస్తిపన్ను బకాయిదారులపై కొరడా

- రెడ్ నోటీసులు జారీ చేస్తున్న బల్దియా
- స్పందించకుంటే నల్లాల తొలగింపు
- కమిషనర్ ఆదేశాలతో కఠిన చర్యలు



నల్లాను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కరీంనగర్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను బకాయిదారులపై నగరపాలక సంస్థ కొరడా ఝళిపిస్తోంది. మార్చి 31లోగా చెల్లించాలంటూ ఫోన్లు చేసినా, నోటీసులు అందించినా మొండి బకాయిదారులు స్పందించడం లేదు. దీంతో మున్సిపల్ చట్టం ప్రకారం రెవెన్యూ రికవరీ యాక్టు చర్యలకు ఉపక్రమించింది. నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ పమేలా సత్పతి, నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ మార్చి 31లోగా వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలని, మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టిపెట్టి చట్టపరమైన చర్యలు చేపడుతూ వసూలు చేయాలని మున్సిపల్ రెవెన్యూ అధికారులకు, వార్డు ఆఫీసర్లుకు, బిల్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో 15 రోజులుగా ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించారు. మార్చి 31లోగా ఆస్తిపన్ను చెల్లించాలంటూ నగరంలోని ముఖ్యకూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతోపాటు కమాండ్ సెంటర్ నుంచి మైకుల్లో ప్రచారం చేస్తున్నారు. వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు కేవలం 15 రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉండడంతో మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్లను సెలవురోజుల్లో కూడా తెరచి ఉంచి పన్నులను స్వీకరిస్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్‌లోనూ చెల్లించే సౌకర్యం కల్పించారు. అయినప్పటికీ మొండి బకాయిలు వసూలు కావడం లేదు. దీంతో వారం రోజులుగా పన్ను బకాయిలను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని, లేనిపక్షంలో ఆర్ఆర్ యాక్టు ప్రకారం నల్లాలను తొలగించడం, ఆస్తులను జప్తు చేయడంతోపాటు ఇతర చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ రెడ్ నోటీసులను అందిస్తున్నారు. ఇళ్లలో ఎవరూ లేకుంటే గోడలపై రెడ్ నోటీసులను అతికించి, గడువు తీరిన వెంటనే ఆయా ఇళ్లకు సంబంధించిన నల్లా కనెక్షన్లను తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 60శాతం వరకు మాత్రమే పన్నులు వసూలు కావడంతో వందశాతం పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు విలీన మున్సిపాలిటీ కొత్తపల్లి, గ్రామం బొమ్మకల్‌లో బకాయిలు ఎక్కువగా ఉండడంతో అక్కడ ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

మరింత ఒత్తిడి పెంచాలి

ఈ నెల 31లోగా వందశాతం ఆస్తిపన్నులు వసూలు చేయాలని, మొండి బకాయిదారులపై మరింత ఒత్తిడి పెంచి పన్నులు రాబట్టాలని మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈమేరకు శనివారం ఆమె ఆస్తిపన్ను వసూళ్లపై కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆర్ఆర్ యాక్టు అమలు చేసి పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలకు సంబంధించిన ఆస్తి పన్నులన్నింటిని వసూలు చేయాలని సూచించారు.

●న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు టౌన్ వన్ ఏడీఈ శ్రీనివాస్ గౌడ్ ప్రకటనలో తెలిపారు. క్రిస్టియన్ కాలనీ, సవరన్ వీధి, విజయ్ మోహన్ రెడ్డి హాస్పిటల్ ఏరియా, జ్యోతినగర్, కోర్టు వెనుక ప్రాంతం, సూపర్ మార్కెట్ ఏరియా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వావిలాలపల్లి, జెండాగద్దే, కెమిస్ట్‌భవన్, శివ థియేటర్, వేంకటేశ్వర ఆలయం, కోర్టు వెనుక ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఏఐతో విద్యార్థులకు మేలు

కరీంనగర్ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యార్థులకు మేలు చేకూరుతుందని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. శనివారం నగరంలోని తీగలగుట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏఐకంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతున్నట్లు చెప్పారు. విద్యాధికారి భద్రయ్య, ప్రధానోపాధ్యాయిని కరుణ పాల్గొన్నారు.

●ముగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో రవీందర్ ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు ప్రధానోపాధ్యాయిని పద్మ, దుర్శేడ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్‌కు సన్మానం

కరీంనగర్ అర్బన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మాజీ మేయర్ వై.సునీల్‌రావును పద్మనాయక వెలమ సంఘం సభ్యులు క్యాంపుకార్యాలయంలో శనివారం సన్మానించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్‌గా ఐదేళ్ల పదవీ కాలం దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమం చేపట్టినట్లు సభ్యులు తెలిపారు. పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, కోశాధికారి భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తాపాల లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

కరీంనగర్ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లోని తాపాల లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. దేవాలయం 26వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విష్ణు సేవానందగిరి స్వామి మాట్లాడుతూ భక్తి భావంతో ముక్తి మార్గాన్ని పొందవచ్చన్నారు. కల్యాణంలో పురమల్ల శ్రీనివాస్, మల్లారెడ్డి, వేల్పుల నారాయణ, మందరాజమల్లు, గోనె నర్సయ్య, రవి, తిరుపతి, తోట తిరుపతి, శివారెడ్డి పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి మున్నూరు కాపులను చైతన్యపర్చాలి

కరీంనగర్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులను ఒకే తాటిపైకి తీసుకొచ్చేందుకు గ్రామ స్థాయి నుంచి చైతన్యపర్చాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బండి సంజయ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘం పటిష్టతకు, కాపుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో మున్నూరు కాపులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. అన్యాయంపై సమష్టిగా పోరాటం చేయాలని హైదరాబాద్‌లో మున్నూరుకాపు మహాగర్జన సభను నిర్వహించ తలపెట్టాలని తీర్మానించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, జాగృతి అధ్యక్షుడు చందు జనార్దన్, యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల శ్రీనివాస్, సూదల వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



మొక్కులు చెల్లించుకుంటున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

గంగాధర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్షకుర్తి వేంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని రథంపై ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అర్చకులు మంగయ్య, చక్రపాణి, ఆలయకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శోభ, నియోజకవర్గ కన్వీనర్ శ్రవణ్ కుమార్, నర్సింహారెడ్డి, మండలాధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

● మండలంలోని ఉప్పర మల్యాలలో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. పనులు నాణ్యతతో చేయించాలని అధికారులకు సూచించారు.

ప్రైవేటు అప్పులు తీర్చేందుకు రైతులకు బ్యాంకు రుణాలు

సుభాష్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రైతులు తమ ప్రైవేటు అప్పులను తీర్చుకోవడానికి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే అవకాశం ఉందని రైతు, ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు అన్నారు. శనివారం నగరంలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వడ్డీ వ్యాపారుల చేతుల్లో ఆర్థికంగా నష్టపోతున్న రైతులకు పంట రుణాలతోపాటు, వారు చేసిన ప్రైవేటు అప్పులను తీర్చేందుకు రుణాలు మంజూరు చేయాలన్న రిజర్వ్ బ్యాంక్ నిబంధనలను బ్యాంకర్లు ఇంతకాలం పాటించ లేదని, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో రుణాలు ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో బ్యాంకుల మేనేజర్ల సమావేశం ఏర్పాటు చేయాలని, అర్హులైన రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. రైతుమిత్ర రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహా రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే కాన్షీరామ్‌కు నిజమైన నివాళి

సుభాష్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బహుజనులు రాజ్యాధికారం సాధించినప్పుడే కాన్షిరాంకు నిజమైన నివాళి అని బీఎస్పీ రెండూ రాష్ట్రాల కో ఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచందర్ రావు అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీఎస్పీ వ్యవస్థాపకుడు మాన్యవర్ కాన్షీరాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే, ఛత్రపతి శివాజీ మహారాజ్, అంబేద్కర్ సిద్ధాంతాల ద్వారా మాత్రమే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనగందుల వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి దొడ్డే సమ్మయ్య, రాష్ట్ర కోశాధికారి నాయిని ప్రణయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాతంగి అశోక్ పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన అడిషనల్ కలెక్టర్

కరీంనగర్ క్రైం, మార్చి 15 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను కమిషనరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయ్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పూల మొక్కను అందజేశారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన పెద్దాపురం శివశంకర్(30) జీవితంపై విరక్తితో శనివారం కరీంనగర్‌లోని కళ్యాణి లాడ్జిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. శివశంకర్ తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో అతడి అమ్మమ్మ దత్తత తీసుకుంది. కొంతకాలంగా తాగుడుగుకు బానిసైన శివశంకర్ జులాయిగా తిరుగుతున్నాడు. జీవితంపై విరక్తితో లాడ్జిలోని బాత్‌రూంలో షవర్‌రాడ్‌కు ఉరేసుకున్నాడు.

'స్మార్ట్' పనులపై నీలినీడలు

(3వ పేజీ తరువాయి)

ఉండగా వాటిని పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మార్చి 31వ తేదీ గడువు విధిస్తూ ఆలోగా పనులు పూర్తి చేస్తే మిగిలిన నిధులను కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది.

● నిధులు విడుదల చేయాలి
- మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

మార్చి 31తో స్మార్ట్‌సిటీ గడువు ముగియనున్నందున ఇప్పటి వరకు ఇవ్వాల్సిన 30 కోట్ల రూపాయల మ్యాచింగ్ గ్రాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి అసంపూర్తి పనులన్నిటినీ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. వారంరోజుల్లో ఈ నిధులు విడుదల చేయకుంటే గడువు ముగిసి పనులు పెండింగ్ పడే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి సహకరించాలని కోరారు. అలాగే నిధుల విడుదల కోసం కృషి చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, స్థానిక ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి, రాష్ట్ర మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కూడా ఆయన లేఖ రాసినట్లు తెలిపారు.

ఘనంగా సెయింట్ జార్జ్ పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భగత్‌నగర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్‌ఈ) పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ ఎంపీపీ వాసాల రమేష్, పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.పాతిమారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వినిరంజన్, భార్గవ్ పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కరీంనగర్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం రాత్రి పారమిత విద్యా సంస్థల ఆధ్వర్యంలో టెడ్-ఎడ్ అంతర్జాతీయ టాక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు, పారమిత నుంచి ఇద్దరు విద్యార్థులు టెడ్-ఎడ్ టాక్స్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభకు తాను మంత్రముగ్ధుడిని అయ్యానని, సివిల్స్‌లో పరీక్ష పాస్ అయినపుడు కూడా ఇంత హ్యాపీగా ఫీల్ కాలేదని పేర్కొన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈవో జనార్దన్‌రావు, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఈ ప్రసాదరావు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, ఎంఈవో ఏనుగు ప్రభాకర్‌రావు, ఎంఈవోలు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలి

కరీంనగర్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పామరాజు రామారావు అన్నారు. శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వినియోగదారులు ఏ వస్తువు కొనుగోలు చేసినా బిల్లు తీసుకోవాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువగా తీసుకుంటే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు గడప కోటేశ్‌కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని సభ్యులు అన్నారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 'స్థిరమైన జీవన విధానానికి న్యాయమైన పరివర్తన' అనే అంశంపై శనివారం నగరంలో చర్చావేదిక నిర్వహించారు. నూతన వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం మోసపోయిన వినియోగదారులు దేశంలో ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు రశీదు తీసుకోవాలని, ఇవ్వని పక్షంలో ఫోరాన్ని సంప్రదించాలని అన్నారు.

ట్రైనీ కలెక్టర్.. హాస్టల్ నిద్ర



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్

మానకొండూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ, వెనుకబడి హాస్టల్‌లో జిల్లా స్థాయి అధికారులు ఒక్కరోజు తప్పకుండా నిద్ర చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మానకొండూర్‌లోని వెనుకబడిన సమీకృత హాస్టల్‌లో శనివారం రాత్రి ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ నిద్ర చేపట్టారు. రాత్రికి హాస్టల్‌కు చేరుకున్న ట్రైనీ కలెక్టర్ వంటగదులు, విద్యార్థులు నిద్రించే గదులు, లైట్లు, ఫ్యాన్లను పరిశీలించారు. రికార్డులతో పాటు విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించి మెనూప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. అనంతరం వంటగదిలో విద్యార్థులతో భోజనం చేశారు. అనంతరం మూత్రశాలలు, మరుగుదొడ్ల పరిశుభ్రత, తాగునీరు, బెడ్‌షీట్స్, దోమతెరలు, పచ్చదనం, పరిశుభ్రత పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో స్థిరపడి దేశానికి ఉపయోగపడే విధంగా తయారు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన అభివృద్ధి అధికారి అనిల్‌ప్రకాశ్, బీసీ డెవలప్‌మెంట్ అభివృద్ధి అధికారి సంపూర్ణ, ఎంపీడీవో వరలక్ష్మీ, సంక్షేమ అధికారి రాజ్‌మహమ్మద్, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



హుజూరాబాద్‌లో కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిర్సపల్లి క్రాస్‌రోడ్ వద్ద బహుజన నాయకుడు కాన్షీరాం జయంతి వేడుకలు, ధర్మసమాజ్‌పార్టీ ఆవిర్భావదినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి, స్వీట్లుపంచారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్‌పార్టీ మండలకన్వీనర్ రాజు, నాయకులు తిరుపతి, వెంకన్న, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: కాన్షీరామ్‌సేవలు మరువలేనివని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పెద్దెల్లిశ్రీనివాస్ అన్నారు. శనివారం చొప్పదండిలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు కడారి గంగరాజు, అరవింద్, రాజలింగం, స్వామి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ సమావేశం

హుజూరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.14,24,60,000 బడ్జెట్ ప్రవేశపెట్టగా మున్సిపల్ ప్రత్యేకాధికారి ప్రఫుల్‌దేశాయ్ ఆమోదం తెలిపారు. సమావేశంలో జూనియర్ అకౌంట్స్ అధికారి సంధ్యారాణి, మున్సిపల్ ఏఈ సాంబరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అశ్వినీగాంధీ, రషీద్, గోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసన



హుజూరాబాద్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల నుంచి ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు శనివారం హుజూరాబాద్‌లో నిరసన చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు సరిగా లేవని, ప్రజలకు ఇచ్చిన హామీలపై నిలదీస్తే జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, బి శ్రీనివాస్, కె శ్రీనివాస్, అయిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

గన్నేరువరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు శ్రీనాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని గునుకుల కొండాపూర్‌లో శనివారం అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలు



రోడ్ రోలర్‌తో మైదానాన్ని చదును చేయిస్తున్న అధికారులు

హుజూరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ క్రీడామైదానంలో ఆదివారం జరిగే రాష్ట్రస్థాయి హాకీపోటీలకు క్లబ్ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రస్థాయి మెన్‌హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు పలుజిల్లాల నుంచి క్రీడాకారులు హాజరుకానున్నారు. హుజూరాబాద్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈనెల 16,17,18వ తేదీల్లో ఉమ్మడి పది జిల్లాల క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ హాజరు కానున్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే కరీంనగర్ జట్టుక్రీడాకారులకు జిల్లాఅసోసియేషన్ సెక్రెటరీ సర్దార్ సురేందర్‌సింగ్, జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు బండ శ్రీనివాస్, తోట రాజేంద్రప్రసాద్, కొలి పాక శ్రీనివాస్, చింత శ్రీనివాస్, రవికుమార్, లక్ష్మీనారాయణ, భూసారపు శంకర్, సమ్మయ్య తదితరులు జెర్సీలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వీణవంక, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్బాకలో ద్విచక్ర వాహనాన్ని డీసీఎం వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఊట్ల ప్రభుదాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రభుదాస్ పనిపై వెళ్తుండగా డీసీఎం డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంగా నడిపి బైక్‌ను ఢీకొట్టాడు. గాయపడిన ప్రభుదాస్‌ను ఆస్పత్రికి తరలించారు. వ్యాన్‌డ్రైవర్ బొంగోని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

ఏఐ ల్యాబ్ ప్రారంభం

చొప్పదండి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుగట్ట ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంఈవో శ్రీనివాస్ దీక్షిత్, ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం: ఎక్సైజ్ సీఐ

హుజూరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని న్యూకాకతీయ హైస్కూల్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసకాకుండా జీవితాన్ని నిర్మించుకుంటూ ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు వినోద్ కుమార్, జుమ్‌లాల్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది ముకుందరెడ్డి, సంతోష్, స్రవంతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు నిరసన దీక్ష

హుజూరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన దీక్ష శనివారం నాల్గో రోజుకు చేరింది. దీక్షలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, నాయకులు రామచంద్రం, శ్రీనివాస్, వసంత్, రమేష్, కుమారస్వామి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ గడపావన శోభాయాత్ర

గన్నేరువరం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకులకొండాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా తయారు చేయించిన రేణుకా ఎల్లమ్మ గడపావనంను గుండ్లపల్లి స్టేజి నుంచి గునుకుల కొండాపూర్ రేణుక ఆలయం వరకు ఊరేగింపుగా శోభాయాత్రను శనివారం నిర్వ హించారు. డప్పుచప్పుళ్లతో మహిళల మంగళహారతులతో బతుకమ్మ ఆటలతో నూతన గడపావనాన్ని ఆలయప్రవేశం చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, గ్రామస్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గడపావనంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న గౌడ కులస్థులు

సంక్షిప్తంగా...

భగత్‌నగర్: ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో డిపోమేనేజర్ మల్లయ్య ఆధ్వర్యంలో ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

● కొత్తపల్లి మండలం చింత కుంట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నేషనల్ రేడియోహౌస్ అధినేత తొడుపునూరి నవీన్‌కుమార్, తొడుపునూరి సత్యనారాయణ శనివారం ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నలుమాచు చంద్రశేఖర్ చొరవతో రూ.70 వేల విలువ చేసే పలు పరికరాలను అందించారు.

సుభాష్‌నగర్: ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి, ఏప్రిల్ 14న అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీలను ఈనెల 18న ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ప్రధానకార్యదర్శి మహేశ్, టీపీవైఎస్ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు ఆనందరావు, జిల్లా అధ్యక్షుడు అజయ్, భీం ఆర్మీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మల్లేశం ప్రకటనలో తెలిపారు.

జమ్మికుంట: పట్టణంలోని మైనార్టీ బాలికల పాఠశాల, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఎంఈవో హేమలత కంటి అద్దాలు పంపిణీ చేశారు.

● మండలంలోని తనుగుల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అజ్మీరా రవి నాయక్ బదిలీవగా తోటి ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు.

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో శనివారం గ్రాడ్యుయేట్‌డే నిర్వహించారు. ఎస్సారార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ తమ్మడి కనకరాజు, ప్రిన్సిపాల్ తమ్మడిశ్రీమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.